రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు



శ్రీనివాస్‌రావుకు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

ముషీరాబాద్: రంగానగర్ కమ్యూనిటీహాల్‌లో రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలను శనివారం నిర్వహించారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు సంఘం అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పానుగంటి వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ ఇన్‌చార్జి పి.మహేశ్, వై.మల్లేశ్, ఈశ్వర్, శంకర్, ముప్పిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వై.శ్రీనివాస్‌రావును పలువురు ఘనంగా సన్మానించారు.

సభ్యులు ఎన్నిక



గుజ్జ సత్యం

కాచిగూడ: తెలంగాణ బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (బీ స్మాట్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుజ్జ సత్యం ఎన్నికయ్యారు. కాచిగూడలో శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి కృషి చేస్తూనే ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కామినేని హాస్పిటల్ సహకారంతో సుందరయ్య పార్కులో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి బీపీ, షుగర్‌తోపాటు గుండె సంబంధిత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హాస్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పి.వి. నిరంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ మనోహర్‌రెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్ రమేశ్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, నిమ్మల రాజశేఖర్, రత్నాకర్ రెడ్డి, జాలివాకర్ కృష్ణ, వెంకట్‌రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలను చైతన్యవంతం చేయాలి

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న కె. శ్రీనివాస్ రెడ్డి

కాచిగూడ: రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ కవి, రచయిత భూతం ముత్యాలు రచించిన, ప్రముఖ ప్రజానాట్యమండలి గాయకుడు పల్లె నరసింహ పాడిన పాటలు 'రాజ్యాంగం రాసిన యోధుడు–అంబేడ్కర్ పాట' ఆడియో పాటల సీడీని కె.శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా సమాజ శ్రేయస్సును అంబేడ్కర్ ఆకాంక్షించగా, ప్రస్తుత సమాజంలో సామాజిక న్యాయం కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు బి.గణేశ్, పి.సైదులు, వి.విజయ్, బి.రమేశ్, ఆర్.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కీర్తనలు

నల్లకుంట: శ్రీ రామగానసభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో ఈనెల 18న ప్రారంభమైన సద్గురు త్యాగరాజు స్వామి 56వ వార్షిక ఆరాధనా సంగీతోత్సవాలు అలరిస్తున్నాయి. శనివారం సాయంత్రం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం(నేటి)తో సంగీతోత్సవాలు ముగుస్తాయని శ్రీ రామ గానసభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస శర్మ తెలిపారు.

నూతన చట్టాలపై శిక్షణ తరగతులు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతనంగా చట్టాలపై ప్రతి శనివారం జూనియర్ అడ్వొకేట్స్, ప్రజలకు అవగాహన కలిపిస్తున్నట్లు సౌత్ ఇండియా అడ్వొకేట్స్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ తెలిపారు. నల్లకుంటలోని జేఏసీ కార్యాలయంలో సీనియర్ అడ్వొకేట్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్లు పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి

అంబర్‌పేట: నాటి తరం నాయకులను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని హైమావతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.నిరంజన్ సూచించారు. రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని ప్రేమ్‌నగర్‌లోని పాఠశాల ప్రాంగణంలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

అస్తవ్యస్తం..అధ్వానం..!

- నల్లకుంట డివిజన్‌లో ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- పగిలిన మూతలు, కొన్నిచోట్ల కుంగిన వైనం
- పట్టించుకోని జలమండలి అధికారులు



న్యూనల్లకుంట ప్రతాప్స్ శివ సదన్ ఎదురుగా పగిలిన మ్యాన్‌హోల్ మూత



నల్లకుంట తిలక్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి పక్క లేన్‌లో కుంగిన మ్యాన్‌హోళ్లు

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌లో పలుచోట్ల మ్యాన్‌హోళ్లు అస్తవ్యస్తంగా..అధ్వానంగా తయారయ్యాయి. ఓవైపు భూగర్భ స్టామ్ వాటర్ పైపులపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లు కుంగిపోగా, మరికొన్ని చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని జలమండలి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నల్లకుంట తిలక్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి పక్క లేన్‌లో, న్యూ నల్లకుంట ప్రతాప్స్ శివ సదన్, ప్రశాంత్‌నగర్ విద్యానగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు, న్యూ నల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లో మ్యాన్‌హోళ్లు ఎగుడు.. దిగుడులా ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు గమనించక తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన జలమండలి అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లపై కొత్త మూతలు ఏర్పాటు చేయాలని అలాగే ఎగుడు దిగుడుగా ఉన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టీ-20 చాంపియన్ హైదరాబాద్



బహుమతి ప్రదానోత్సవంలో తెలంగాణ శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎంఎస్‌కె. ప్రసాద్

అంబర్‌పేట: రాజీవ్‌గాంధీ మెమోరియాల్ అండర్–19 క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు నిలిచింది. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్‌లో తమిళనాడు, హైదరబాద్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసి ఓటమి పాలైంది. అనంతరం శనివారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి.హనుమంత రావు, భారత మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బహుమతి అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంబుల శ్రీకాంత్‌గౌడ్, ప్రతినిధులు ఆది అవినాష్, సయ్యాద్ సాదిక్ పాషా, అమర్‌జీత్ కుమార్, రజనీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పేరెంట్స్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సెయింట్ ఫ్రాన్సిస్ అసిస్ బాయ్స్ హైస్కూల్ రాంనగర్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నది. విద్యార్థులు విద్యుత్, అయస్కాంతం, వ్యవసాయం, పర్యావరణం, ఎలక్ట్రికల్, తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి, ఉపాధ్యాయులు రిచర్డ్, దిలీప్ పాల్గొన్నారు.

ఒగ్గు కళాకారుడికి డాక్టరేట్ ప్రదానం

కాచిగూడ: ప్రముఖ ఒగ్గు కళాకారుడు నంద నరేశ్‌కు బర్కిలీ, చికాగో (యూఎస్ఏ)కు చెందిన యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను రిటైర్డ్ జడ్జి మధుసూదన్ శనివారం నరేశ్‌కు అందజేశారు. ఒగ్గు కళా రంగంలో నరేశ్ చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. అంతరించిపోతున్న ఒగ్గు కళను సోషల్ మీడియా వేదికగా సమాజానికి తెలియజేస్తున్నానని, తనను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న ఒగ్గు కళాకారుడు నరేశ్

పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి

అంబర్‌పేట: పేదల పక్షాన పోరాటం చేస్తూనే పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం నగర కార్యదర్శి ఎం. వెంకటేశ్ అన్నారు. సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభల సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రాంగణంలో శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు అమలయ్యేలా దశల వారీగా నిరసనలు, పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మహేందర్, నాయకులు జి.రాములు, సుబ్బారావు, సోమన్న, షబానా, నిరంజన్, మోహన్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గూడూరి హరికుమారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

కవాడిగూడ: సఖీ జాతీయ మహిళా మండలి అధ్యక్షురాలు మంజూషాను కులం పేరిట దూషించి మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న సఫీల్‌గూడలోని సీతారాం నగర్ ఆర్తీఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న గూడూరి హరికుమారిని కఠినంగా శిక్షించాలని సఖీ జాతీయ మహిళా మండలి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో శనివారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సఖీ జాతీయ మహిళా మండలి వ్యవస్థాపక చైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ.. అపార్టుమెంట్‌లో కామన్ ఏరియా నుంచి తన ఇంటికి వెళ్తున్న మంజూషాను హరికుమారి పలుమార్లు హత్యచేసేందుకు ప్రయత్నాలు చేసిందన్నారు. హరికుమారి నుంచి మంజూషాకు రక్షణ కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. సఖీ జాతీయ మహిళా మండలి సభ్యులు ఎస్ శ్యామల, బీ వరలక్ష్మి, సుజాత, స్వరూప, సురేఖ, ఈశ్వరమ్మ, మంగాదేవి, శారద, లక్ష్మీబాయి, దమ్మక్క, రాజేశ్వరి, లక్ష్మి, రేఖ, రేణుక, శ్రీలత, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

కాచిగూడ: అవినీతి రహిత సమాజం కోసం, దేశ సమగ్ర అభివృద్ధికి యువత రాజకీయాల్లో రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలో నిర్వహించిన తిరంగా ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, పారిశ్రామికంగా అగ్రదేశంగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి యువ నాయకత్వం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, తంగెళ్లముడి నందగోపాల్, ఉదయ్ నేత, బలరాం, అనంతయ్య, నిఖిల్ పటేల్, రాందేవ్, లింగస్వామి, నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ ఫ్లైఓవర్‌కు శివశంకర్ పేరు పెట్టాలని వినతి



టీపీసీసీ అధ్యక్షుడికి వినతి పత్రం ఇస్తున్న ఎలిగేటి మహేశ్ తదితరులు

కవాడిగూడ: పాతబస్తీలోని ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు నిర్మించిన ఫ్లైఓవర్‌కు కేంద్ర మాజీమంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ పేరు పెట్టాలని శివశంకర్ ఫాలోవర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈమేరకు ఎలిగేటి మహేశ్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను శనివారం కలిసి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. హుసేన్ హాలంలో జన్మించి ఇదే ప్రాంతంలో విద్యనభ్యసించి సాధారణ అడ్వకేట్‌గా జీవితం ప్రారంభించి కాంగ్రెస్‌లో జాతీయస్థాయిలో కీలక నేతగా ఎదిగారని ఆయన గుర్తు చేశారు.

వివాదాలకు తావులేకుండా ముందుకెళ్తాం

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్ రోడ్‌లోని హెబ్రోన్ చర్చిలో ఇకనుంచి వివాదాలకు తావులేకుండా ట్రస్ట్, సొసైటీ సభ్యులంతా ఏకతాటిపై ముందుకు సాగాలని నిర్ణయించినట్లు ట్రస్ట్ వైస్ చైర్మన్ అద్దంకి ఇమాన్యుల్, సొసైటీ చైర్మన్ జాన్ సుందరం తెలిపారు. గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోన్ చర్చి ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సొసైటీ ట్రస్టులు రాజీపడి చర్చి నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నామన్నారు. స్థానిక కమిటీకి చర్చిలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు అర్హత లేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు స్థానికులను కలిసి ఇబ్బంది కలిగిస్తున్నారని, రాగి వీరాచారి కూడా చర్చి సభ్యుడేనని అన్నారు. కోర్టు కూడా ట్రస్ట్, సొసైటీ కలిసి నిర్వహణ చేపట్టాలని సూచించిదని, ఈ మేరకు రాజీపడి కొనసాగిస్తుంటే స్థానికత పేరుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే 4 నెలలుగా చర్చికి వచ్చిన ఆదాయానికి సంబంధించిన లెక్కలు చూపాలన్నారు. కోర్టులో కేసులకు సంబంధించిన అంశాలు సొసైటీ తరపున వీరాచారి, ట్రస్ట్ తరపున వెంకటేశ్వరరావు చూస్తున్నారన్నారని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ట్రస్ట్ వైస్ చైర్మన్ అద్దంకి ఇమాన్యుల్, సొసైటీ చైర్మన్ జాన్ సుందరం

స్వామి వివేకానంద జయంతి

చిక్కడపల్లి: తెలుగు భాషా చైతన్యసమితి, త్యాగరాయగాన సభ, కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్తాధ్వర్యంలో కళా సుబ్బారావు కళావేదికలో స్వామి వివేకానంద జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద ఆధునిక భారత నిర్మాణానికి ఎంత కృషి చేశారన్నారు. అనంతరం తెలుగు భాషా చైతన్య సమితి కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి, నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, కవి గంటా మనోహర్‌రెడ్డి, నాగయ్య కళాపీఠం చైర్‌పర్సన్ పాలడుగు సరోజనీదేవి, సంఘసేవకులు నక్క శ్రీనివాస్‌యాదవ్, అర్ధ చంద్రప్రకాశ్‌రెడ్డి, నిర్వాహకుడు బడేసాబ్, కవి గజవెల్లి సత్యనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది



ప్రతిజ్ఞ చేయిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతీదివాకర్

కాచిగూడ: ప్రజాస్వామ్యానికి ఓటే పునాది లాంటిదని జీహెచ్ఎంసీ అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ ఎ.మారుతీదివాకర్ పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఓటు హక్కు వినియోగించేలా తమ తల్లిదండ్రులను విద్యార్థులు చైతన్య పరచాలని కోరారు. మతం, జాతి, కులం, వర్గం, వర్ణం, భాష బేధం లేకుండా ఎలాంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటేస్తామని విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విద్యార్థులు మానవహారం నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ నోడల్ ఆఫీసర్ రజిత, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చిరంజీవి, ప్రభుత్వ హైస్కూల్ హెడ్ మాస్టర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.ప్రసాద్‌రావు, రాంమోహన్, అనిల్‌రెడ్డి, ఖుష్రో, మీరాజుద్దీన్, ఉపాధ్యాయులు ఉదయగిరి ప్రభాకర్, వీరేశం, శోభ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

చిక్కడపల్లి: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని పేర్కొన్నారు. జలమండలి జీఎం రామకృష్ణతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంజూరు చేసిన నూతన పైప్‌లైన్ పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. అలాగే డివిజన్‌లో పలుచోట్ల తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య అధికంగా ఉందని, ఇదివరకే ఫిర్యాదు చేసినా ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. త్వరగా చర్యలు చేపట్టాలని సూచించారు. వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.



వాటర్‌వర్క్స్ జీఎం రామకృష్ణతో సమీక్షిస్తున్న కార్పొరేటర్ పావని

యూపీహెచ్‌సీలో కేంద్ర వైద్య బృందం తనిఖీ



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర వైద్య బృందం

ముషీరాబాద్: భోలక్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ కేంద్ర వైద్య బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అందిస్తున్న సేవలు, మందులు వివరాలు, ప్రతిరోజు వస్తున్న రోగుల సంఖ్య, నార్మల్ డెలివరీలు తదితర వివరాలను కేంద్ర వైద్య బృందం డాక్టర్లు కవిత, మాళవికత యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై కేంద్ర వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి పీహెచ్ఎన్‌లు కమలమ్మ, ఫెల్లీస్, ఏఎన్ఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే షెడ్యూల్డ్ కులాల సమగ్రాభివృద్ధి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎస్సీ వర్గీకరణతోనే షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సాధ్యమవుతుందని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి ఎ. భరత్‌భూషణ్ అన్నారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సంఘీభావ సదస్సు శనివారం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా రిజర్వేషన్లపై అంతర్గత విభేదాలతో షెడ్యూల్డ్ కులాలు ఐక్యతను కోల్పోయి రాజ్యాధికారానికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి మాట్లాడుతూ..షెడ్యూల్డ్ కులాల్లోని ఏ కులానికి అన్యాయం జరగకుండా వారి జనాభా నిష్పత్తి ప్రకారం పంపిణీ జరగాలని, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని, యూనివర్సిటీల్లోని ఖాళీలను ఏబీసీడీ వర్గీకరణ ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు ప్రొఫెసర్ పి. ముత్తయ్య, రచయిత జూపాక సుభద్ర, కృపాకర్ మాదిగ, వశపాక నర్సింహ, దున్న యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌భూషణ్



కియా నూతన కారు ఆవిష్కరణ

హోటల్ మారియట్‌లో శనివారం రాత్రి కియా సైరోస్ నూతన వెర్షన్ కారును ఆవిష్కరిస్తున్న ప్రాస్పరా కియా ఎండీ సిరాజ్ బాబూఖాన్ - కవాడిగూడ

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగస్వాములవుతాం

అంబర్‌పేట: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో తాము భాగస్వాములు అవుతామని అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నేత పూలిజాల గెల్వయ్య తెలిపారు. డీడీ కాలనీలోని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను శనివారం కలిశారు. ఈ సందర్భంగా గెల్వయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 7న నిర్వహించే 'లక్ష డప్పులు–వేయిగొంతుకలు' కార్యక్రమానికి సన్నద్ధం అవుతున్నామన్నారు. వర్గీకరణ సాధించేవరకు మందకృష్ణ మాదిగ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నేతలు ఉన్నారు.

జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించొద్దు

కాచిగూడ: జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించొద్దని అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం డిమాండ్ చేశారు. కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో శనివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీ అండ్ టీజీ బీఈఎఫ్) 30వ త్రైవార్షిక మహాసభలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏమిటని, జాతీయ బ్యాంకులు సరిగ్గా పనిచేయకుంటే లక్షల కోట్ల లాభాలు ఎలా వస్తున్నాయని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యాజమాన్యాల దుర్వినియోగం, నిర్వహణ లోపాల వల్లే పలు ప్రైవేట్ బ్యాంకులు మూతపడ్డాయే కానీ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎక్కడా అలాంటి చర్యలు లేవన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (బెంగుళూర్) ప్రొఫెసర్ బాబు మాథ్యూస్, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ కిశోర్ రాయలు, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్.రాంబాబు, టీ రవీంద్రనాథ్, వంక ఉదయ్ కుమార్, పీవీ కృష్ణారావు, సమద్ ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ వెంకటాచలం